www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబరు 2022
5
ఏలూరు



నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో డిసెంబర్ 12వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలల్లోనూ స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నారుమడులకు వర్షం అడ్డంకి..!


పశ్చిమలో 33.16, ఏలూరు జిల్లాలో 13.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నారుమడి వేసేందుకు రైతులు వెనుకంజ

రెండు జిల్లాలోనూ 3.20 లక్షల ఎకరాల్లో రబీసాగు

ఇప్పటికీ కల్లాల్లోనే ఖరీఫ్ ధాన్యం

రబీలో ధాన్యం కొనుగోలుపై ఇప్పటి నుంచే రైతుల్లో బెంగ



నారుమడుల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాండూస్ తుపాను ప్రభావం రబీ నారుమడులపై పెనుప్రభావం పడింది. ముమ్మరంగా నారుమడులు వేస్తున్న తరుణంలో మాండూస్ తుపాను వల్ల కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు జిల్లాల్లోనూ ఇప్పటి వరకూ 20శాతం వరకూ రబీ నారుమడులు వేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ప్రతి మండలంలోనూ ముమ్మరంగా నారుమడుల ప్రక్రియ సాగుతోంది. తుపాను ప్రభావంతో రెండు జిల్లాల్లోనూ వర్షాలు పడుతున్నాయి. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లాలో సరాసరి వర్షపాతం 33.16 మిల్లీమీటర్లు నమోదుకాగా, ఏలూరు జిల్లాలో 13.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గణపవరం మండలంలో 44.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమడోలులో 36.4 మిల్లీమీటర్లు, నిడమర్రులో 31.6 మిల్లీమీటర్ల చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలో 78.4 మిల్లీమీటర్లు, అత్తిలిలో 67.4, పోడూరు మండలంలో 70.2 మిల్లీమీటర్ల అత్యధిక వర్షం కురిసింది. వర్షాలకు ఇప్పటికే వేసిన నారుమడులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడటంతో మిగిలిన చోట్ల నారుమడులు వేసేందుకు రైతులు ఆలోచిస్తున్నారు. తుపాను ప్రభావంతో రెండు జిల్లాల్లోనూ వర్షం, చలిగాలులతో వాతావరణం అనుకూలంగా లేదు. దీంతో రైతులు నారుడులు వేసేందుకు భయపడుతున్నారు. నారుమడివేస్తే వర్షాలకు దెబ్బతినే అవకాశం ఉందని, అదే జరిగితే మరోసారి విత్తనాలు కొనుగోలు చేయాలంటే పెట్టుబడి భారమవుతుందని రైతులు ఆలోచిస్తున్నారు. రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. నారుమడులు త్వరితగతిన పూర్తయితే సంక్రాంతి పండుగకు ముందే నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది రైతులు నారుమడులు ముందుగానే ప్రారంభించినప్పటికీ వర్షం ప్రభావంతో ఆలస్యమైంది. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాతనే నారుడులు వేయాలని రైతులు భావిస్తున్నారు. దీంతో రబీ నారుమడులు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

ఇప్పటికీ కల్లాల్లోనే ఖరీఫ్ ధాన్యం

ప్రభుత్వం తెచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానం ఖరీఫ్ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. దాదాపుగా ఖరీఫ్ మాసూలు పూర్తయినప్పటికీ ఇప్పటికీ ధాన్యం కొనుగోలు మాత్రం పూర్తికాలేదు. కొన్ని మండలాల్లో 50శాతం, మరికొన్ని మండలాల్లో 20 శాతంపైగా ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. తేమశాతం పేరుతో మిల్లర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆర్‌బికెల్లో తేమశాతం సరిపోయిందని ధాన్యం కొనుగోలు చేసిప్పటికీ మిల్లరు మాత్రం తేమశాతం అధికంగా ఉందంటూ ధాన్యం వెనక్కి పంపిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. తూకంలో తేడా వచ్చిదంటూ రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తొలుత ఇ-క్రాప్ పూర్తయిన ప్రతి ఎకరా పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పి.. ఇప్పుడు టార్గెట్‌లు పూర్తయ్యాయని, వ్యాపారులకు, మిల్లర్లకు అమ్ముకోవాలని చెబుతున్న ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రైతులు మండిపడుతున్నారు. కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో వర్షాలకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. రబీలో ధాన్యం కొనుగోలు ఇదేవిధంగా ఉంటే తమ పరిస్థితి ఏమిటంటూ రైతులు ఇప్పటి నుంచే తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలులోనూ ఇదే పరిస్థితి కొనసాగితే ఇక వ్యవసాయం చేయడం కష్టసాధ్యమన్న భావనకు రైతులు చేరుకున్నారు. రబీ ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించకపోతే రైతులకు కష్టాలు తప్పవని చెప్పొచ్చు.

వ్యకాస రాష్ట్ర 29వ మహాసభ విజయవంతానికి

సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ విజయవంతంగా ముగిసిందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం. పి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో డిసెంబర్ ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకూ ఐదు రోజులపాటు మహాసభ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల నిర్వహణ విజయవంతంగా సాగిందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహాసభ ఇంతలా జయప్రదానికి ఎంతో మంది దాతల సహాయ సహకారాలు అందించారని తెలిపారు. వారందరికీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

పేద, బలహీన వర్గాల ప్రజలు భూమి, ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ ఈ జిల్లాలో జరపడం సంతోషకరమన్నారు. ఈ సభకు వేలాదిమందిగా తరలివచ్చిన వ్యవసాయ కార్మికులకు, ఉపాధి కూలీలకు, కార్మికులకు, రైతులకు కౌలు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో ఈ మహాసభ స్ఫూర్తితో పేదల సమస్యలపై నిరంతరం శ్రమిస్తూ ప్రజల హక్కుల కోసం పనిచేయడం జరుగుతుందని తెలిపారు.

ఏలూరులో 'కార్తీకదీపం' డాక్టర్ బాబు సందడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్తీకదీపం సీరియల్ హీరో నిరూపమ్ (డాక్టర్ బాబు) ఆదివారం నగరంలో సందడి చేశారు. స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న చందనా బ్రదర్స్ 22వ వార్షికోత్సవం సందర్భంగా వచ్చిన ఆయన తన సతీమణి మంజులతో కలిసి లక్కీడిప్‌లో విజేతలుగా నిలిచిన 22 మందికి బహుమతులు ప్రధానం చేశారు. తొలుత చందన బ్రదర్స్‌కి విచ్చేసిన కొనుగోలుదారులను ఉత్సాహపరుస్తూ కొన్ని డైలాగులను చెప్పారు. చందన బ్రదర్స్ నిర్వాహకులు జగదీష్ వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం చందనబ్రదర్స్‌లోని నగల షోరూంను సందర్శించి వినియోగదారులను అలరించారు. ఈ కార్యక్రమంలో చందనా బ్రదర్స్ సంస్థ నిర్వాహకులు, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సందడి చేస్తున్న డాక్టర్‌బాబు

రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ధాన్యం రాసుల వద్ద రైతుం సంఘం నాయకులు

ప్రజాశక్తి - గణపవరం

మాండూస్ తుపాన్ వల్ల తడిచిపోయి రంగు మారిన ధాన్యాన్ని తేమ శాతం నిబంధనలు సడలించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, రైతు సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉభయ సంఘాల ప్రతినిధుల బృందం మండలంలోని కేశవరం, జల్లి కాకినాడ, తాళ్లపాలెం, మొయ్యేరు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వరి కోతలు కోసి ధాన్యం రాశులు కల్లాల వద్ద అలాగే ఉండిపోయాయన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతు భరోసా కేంద్రాల వద్దకు తిరుగుతున్నప్పటికీ ప్రభుత్వం కొనడం లేదన్నారు. ప్రయివేట్ వారికి అమ్ముకోమనడం పట్ల వారు తీవ్ర విమర్శలు చేశారు. రైతు పండించిన ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని గొప్పలు చెప్పిన ప్రభుత్వ అధికారులు ఇప్పుడు రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయబోమని చెప్పటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వారం రోజుల్లో సొమ్ములు రైతులకు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, కె.సోమయ్య, ఆర్.సత్యనారాయణ, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యం.. ఆందోళనలో రైతాంగం



ముదినేపల్లిలో రైతుల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

బంగాళఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాన్ మండలంలోని రైతుల గుండెల్లో రైళ్ల పరిగెట్టిస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. వాతావరణ శాఖ తుపాన్ గురించి హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల్లో మరింత కలవరం మొదలైంది. చేతికి వచ్చిన పంటను గట్టెక్కించేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. మండలంలోని కొన్ని పాంత్రాల్లో ఆరబెట్టిన పనలను రైతులు కుప్పలుగా వేయగా, మరికొన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రాసులుగా పోసి అవి తడవకుండా పరదాలు కప్పే పనుల్లో రైతులు నిమఘ్నమయ్యారు. మండల వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో రైతులు సార్వా వరిసాగు చేపట్టగా కొన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తికాగా, మరికొన్ని గ్రామాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని గురజ, సంకర్షణపురం, పెనుమల్లి, ముదినేపల్లి తదితర గ్రామాల్లో చేల్లో ఉన్న వరి పనలు తడిసిపోయాయి. చేలల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు పనలు గట్టకు చేరవేసి పరదాలు కప్పి భద్రం చేసుకునే పనుల్లో ఉన్నారు. తమ ఆశలను తుపాన్ అడియాశలు చేసిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క తుపాన్ ప్రభావంతో మరోపక్క ప్రభుత్వం పెట్టిన కొత్త నిబంధనలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించి తడి, పొడి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను తుపాన్ గండం నుంచి గటెక్కించాలని మండల రైతులు కోరుతున్నారు.

చింతలపూడి : ఒక పక్క తుపాన్, మరోపక్క ప్రభుత్వం నూతన విధానాలు రైతు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షానికి ధాన్యం తడిచిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే మరణమే శరణ్యమని వాపోతున్నారు. గోనె సంచుల కొరతతో రైతులు ధాన్యం కల్లాల్లోనే పరిస్థితి నెలకొంది. చింతలపూడి మండలంలో ఎక్కడపడితే అక్కడ ధాన్యం రాసులు కనిపిస్తున్నాయి. పాత చింతలపూడి, గణిచర్ల, మల్లయ్యగూడెం, సమ్మెటవారిగూడెం, రేచర్ల గ్రామాల్లో రోడ్డు పక్కన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని, పంటను మిల్లర్లకు పంపించే ప్రయత్నం చేయటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



చింతలపూడి మండలంలో కల్లాల్లో ధాన్యం



రైతులను ఆదుకోవాలి
సర్వేశ్వరరావు, రైతు

రైతులకు కాకుండా మిల్లర్లకు మేలు చేసే విధంగా ప్రభుత్వం నూతన విధానం ఉంది. గోనె సంచులు అందించడంలేదు. వర్షానికి ధాన్యం తడుస్తోంది. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.






ముదినేపల్లి మండలంలో రైతుల అవస్థలు

మంచు.. ఆరోగ్యం ముంచు..!

నిర్లక్ష్యం చేస్తే చేటే - అప్రమత్తమే ప్రధానం



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'మంచు అని తేలిగ్గా తీసుకోవద్దు. పొగమంచు అన్న నిర్లక్ష్యం వద్దు'.. అవి ఆరోగ్యంపై విపరీతంగా ప్రభావం చూపుతాయి. అనారోగ్యానికి గురిచేస్తాయి. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులపై పంజా విసురుతాయి. పంటలు, పశుపక్ష్యాదులకు సైతం తీవ్ర నష్టానికి గురిచేస్తాయి. దీనికి అప్రమత్తతే ప్రధానం అని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా విపరీతమైన పొగమంచు కరుస్తోంది. చలి తీవ్రత కూడా పెరిగింది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సైతం తగ్గుముఖం పట్టాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పాటించకుంటే మూల్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా చిన్నారులకు చిన్నపాటి గాలి తగిలినా జలుబు, దగ్గు వంటి రుగ్మతలు చేరుతాయి. అందుకే వీలైనంతవరకూ సాయంత్రం నాలుగు గంటలు దాటితే పిల్లలను బయటకు పంపించకూడదు. అటు ఉదయం 8 గంటల వరకూ వారిని ఇంటిపట్టునే ఉంచడం మంచిది. వేడి నీటితో స్నానం చేయించడం ఉత్తమం. స్కూల్‌కు పంపించినప్పుడు స్వెర్టర్లు అందుబాటులో ఉంచడం మంచిది. వీలైనంత వరకూ వేడి ఆహార పదార్థాలు పిల్లలకు వడ్డించాలి. ఐస్‌క్రీమ్‌లు, చాక్లెట్లు, కూల్ డ్రింక్‌లు వంటి వాటికి దూరంగా ఉంచాలి. నెలల వయసుండే చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వారు చలికి తట్టుకునే విధంగా వేడిని అందించాలి. జలుబు, దగ్గు వంటి రుగ్మతలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్యం అందించాలి. వృద్ధుల విషయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వారి ఆహారం విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు అవసరం. చాలామంది వృద్ధులు వేకువజామున నిద్రలేవడం అలవాటు. అలాంటి వారు ఇంటి నుంచి బయటకు రాకుండా చూడాలి. ప్రధానంగా అస్మా వంటి రుగ్మతలతో బాధపడేవారిని ఎట్టి పరిస్థితుల్లో సాయంత్రం నాలుగు గంటల తరువాత ఇంటి నుంచి బయటకు రాకపోవడం ఉత్తమం. మద్యం, దుమపానం అలవాటు ఉన్నవారు వీలైనంత వరకూ వ్యసనాలకు దూరంగా ఉండడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. వీలైనంత వరకూ ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రయాణాలు వాయిదా వేసుకోవడం చాలామంచిది. పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా అత్యవసర సేవల విభాగ వాహన చోదకులు ఎక్కువగా రాత్రిపూటే రాకపోకలు సాగిస్తుంటారు. పాలు, కూరగాయలు, పెట్రోల్, నిత్యావసరాలు వంటి సరఫరా రాత్రి సమయాల్లోనే జరుగుతుంటాయి. అటువంటి వాహన చోదకులు వీలైనంతవరకూ వేగ నియంత్రణ పాటించడం ఉత్తమం.

జాగ్రత్తలు అవసరం

మంచు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మంచుబారిన పడితే శ్వాసకోశ, చర్మ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. హదయ స్పందనలో మార్పు వచ్చే అవకాశం ఉంది. గర్భిణులు, చిన్నపిల్లలు, మంచులోకి రాకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే తలకు, చెవులకు రక్షణ కలిగించే దుస్తులు వాడాలి. మంచులో నుంచి వచ్చిన వెంటనే వేడినీటితో స్నానం చేయడం మంచిది.

-డాక్టర్ శ్రీనివాసరాజు, ఇఎన్‌టి వైద్యులు

ఊపిరితిత్తులపై ప్రభావం

ఈ సీజన్‌లో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా ఆస్మా ఉన్న పిల్లల పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పొగమంచు, దుమ్ముతో ఊపిరితిత్తులపై భారం పడే అవకాశాలు ఉన్నాయి. ఉదయం 9 గంటల్లోపు, సాయంత్రం ఐదు గంటల తరువాత ఇంట్లోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణంలో మార్పులు వల్ల చర్మ సంబంధ వ్యాదులు సంక్రమించే అవకాశాలున్నాయి. ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి.

గుండె జబ్బులకు అవకాశం

ప్రముఖ వైద్యులు నాగేశ్వరరావు

ఐదు పదుల వయసు దాటిన వారు మద్యం సేవించకూడదు. దూమపానం చేయకూడదు. చలిమంటలకు దూరంగా ఉండాలి. వీటివల్ల శరీరం నుంచి నీరు ఎక్కువగా యూరిన్ ద్వారా బయటకు పోయి డీ హైడ్రేషన్ సంభవిస్తుంది. గుండె జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉంది. పొలం పనులకు వెళ్లాల్సి వస్తే కచ్చితంగా మాస్క్ వాడాలి. దుమ్ము పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

వాలీబాల్ నారాయణరాజు స్ఫూర్తి.. ఆదర్శం

ఉప ముఖ్యమంత్రి కొట్టు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి - ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న క్రీడీ నిర్వాహకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

కీర్తిశేషులు వాలీబాల్ నారాయణరాజు పేరున ఇంత పెద్ద ఎత్తున రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని, నారాయణరాజు ఒక వ్యక్తి కాదని శక్తి అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులతోపాటు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్‌పి ఛైర్మన్ కౌరు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) విచ్చేశారు. ఈ సందర్భంగా నారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నారాయణరాజు మెమోరియల్ నిర్వాహకులు పవన్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నారాయణరాజు గుర్తుగా ఆయన కుమారుడు పవన్‌కుమార్ రాజు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నారాయణరాజు క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అందరి సమిష్టి కృషితో క్రీడలు ఘనంగా నిర్వహించి క్రీడాకారులకు చేయూతనివ్వడం అభినందించదగ్గ విషయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, ఎంపిటిసిలు నాగలక్ష్మి, స్వాతి, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు, గ్రామ పెద్దలు గాదిరాజు రాంబాబు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మహిళా విభాగంలో గుంటూరు, పురుషుల వి భాగంలో ప్రకాశం జిల్లా జట్టు గెలుపు

పాలకోడేరులో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. 13 జిల్లాల నుంచి 13 మహిళా, 13 పురుష జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. క్వార్టర్, సెమీ ఫైనల్‌లో సత్తా చాటి ఫైనల్‌లో జట్లు పోటీపడ్డాయి. మహిళా విభాగంలో గుంటూరు జిల్లా జట్టు మొదటి స్థానంలో గెలుపొందిగా, కృష్ణా జిల్లా జట్టు రెండో స్థానం, పశ్చిమగోదావరి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా మొదటి స్థానం సాధించగా, పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానం, విశాఖపట్నం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన క్రీడాకారులకు గదిరాజు నారాయణ రాజు మెమోరియల్ ఆధ్వర్యంలో గాదిరాజు పవన్ కుమార్‌రాజు సహకారంతో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు బహుమతులు ప్రదానం చేశారు.



గెలుపొందిన పురుషుల విభాగం మొదటి జట్టు



రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - చింతలపూడి

నామవరం- సీతానగరం రోడ్డు వేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని నామవరం సర్పంచి బాదరాల వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నామవరంలో రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రావెల్‌తో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నామవరం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారడంతో రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయాన్ని తెలుగుదేశం సీనియర్ నాయకులు సూరనేని గోపినాధ్ (గోపి బాబు) దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సొంత ఖర్చుతో అగ్రహారం నుంచి నామవరం గ్రామం వరకు గ్రావెల్‌తో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారని తెలిపారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం ఎదురుగా ఉన్న ఐసిఎం చర్చి ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిఎం పీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డిరాజు ఆధ్వర్యంలో తొలుత ఆ సంస్థల జెండాను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఐసిఎం సంస్థల అంతర్జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జాన్ ఎస్‌డి రాజు మాట్లాడుతూ ఏలూరు నగరం కేంద్రంగా ప్రపంచంలో ఉన్న ఐసిఎం చర్చిలన్నీ నడుస్తాయని తెలిపారు. దినదినాభివృద్ధిలో భాగంగా ఐసిఎం సంస్థ అభివృద్ధి సాధిస్తుందని, ఇది సంఘస్తులందరి కృషితోనే సాధ్యమైందని తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బిషప్ జాన్ ఎస్‌డి రాజు కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఆయనం నిరంతరం సంస్థ అభ్యున్నతి కోసం పాటుపడుతుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి రెవరండ్ ఏసురత్నం, కార్యదర్శి ఎన్‌వైవి.ప్రసాద్, బోర్డు సభ్యులు ఆర్.రవికుమార్, టి.ఆషాయ్య, డాక్టర్ జాన్ లియో, టి.యోహన్, సిహెచ్ జాకబ్‌రాజ్, ఎన్.రోజీజాన్ పాల్గొన్నారు.



గ్రామాల్లో క్రిస్మస్ స్టార్ల సందడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిల నిర్వాహకులు క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. చర్చిల వద్ద నక్షత్ర నమూనాలను ఏర్పాటు చేయడంతో పాటు పశువుల పాక నమూనాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పలు గ్రామాల్లో చర్చిలకు విద్యుత్ దీపాలంకరణలు చేయడంతో రాత్రి సమయాల్లో పలువురిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని గురజ సర్వేషన్ ఆర్మీ చర్చి వద్ద గ్రామస్తులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్ అందరిని ఆకట్టుకుంటుంది. మరో రెండు వారాల్లో క్రిస్మస్ పండుగ రావడంతో చర్చిలను పాస్టర్లు సర్వాంగ సుందరంగా అలంకరణ చేసే పనుల్లో నిమఘ్నమయారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని, లేకపోతే రైతులకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామని జనసేన పార్టీ మండల కన్వీనర్ బాబు అన్నారు. మండలంలోని సమ్మెటవారిగూడెంలో ధాన్యం రాశులను ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గోనె సంచులు ఇవ్వటం లేదని, ధాన్యం కల్లాల్లోనే తడిచిపోతుదని, ధాన్యం కొనుగోలు చేయకపోతే మరణమే శరణ్యమని రైతులు వాపోయారు. బాబు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పి వారినే చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

బోర్డర్ చెక్ పోస్ట్ వద్ద పటిష్ట భద్రత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఇబి అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు తెలిపారు. జీలుగుమిల్లి మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు గుండా అక్రమ మద్యం, గంజాయి, గుట్కా వంటివి పోకుండా సిబ్బంది నిరంతరం గస్తీ ఉండాలని ఆదేశించారు. అదే విధంగా నాటు సారా నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఇబి సిఐ మణికంఠ రెడ్డి సిబ్బంది ఉన్నారు.



కొయ్యలగూడెంలో వంగవీటి రంగా విగ్రహం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కీర్తిశేషులు వంగవీటి మోహనరంగా 34వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించాలని పట్టణ కాపు సంఘం, కాపు సంక్షేమసేన తీర్మానం చేశాయి. ఆదివారం కాపు సంఘ ప్రముఖులు చోడిపిండి సుబ్రహ్మణ్యం నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ఎనిమిది అడుగుల విగ్రహాన్ని కొయ్యలగూడెంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యానాం దగ్గర గాడిలంకలోని ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రంగా విగ్రహం రూపుదిద్దుకుందన్నారు. డిసెంబర్ 26 రంగా వర్ధంతి సందర్భంగా విగ్రహాన్ని ఆయన కుమారుడైన వంగవీటి రాధా చేతుల మీదుగా ఆవిష్కరింప చేయనున్నట్లు తెలిపారు. కాపు సంఘ ప్రముఖులు తాడికొండ మురళీకృష్ణ, దుగ్గిన శ్రీనివాస్, మలిశెట్టి ఏసుబాబు, పైడిముక్కల కృష్ణ, మేకల సత్యతేజ, మధు, కొట్టు ఏడుకొండలు, బి.కిరణ్, వెలుగుల సూర్య పాల్గొన్నారు.

ఇసుక జాడ ఏదీ?

పేరుకే ఉచితం
నిర్మాణాలు ముందుకెళ్లక లబ్ధిదారుల గగ్గోలు
రాజమహేంద్రవరం నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే ధరాభారం

ప్రజాశక్తి - దెందులూరు

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హౌసింగ్ కాలనీల్లో ఇసుక తీవ్రంగా కొరత ఏర్పడటంతో ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో లబ్ధిదారులు ఇసుక దొరకక పడే బాధలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని ప్రకటనలు చేయటంతో గంపెడాశతో ఎదురు చూశారు. ఇచ్చిన హామీని అమలు పరచటంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రస్తుతం జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొనటంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడనే నిలిచిపోయాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చని విధానాలు

గత నెల రోజులుగా ఇసుక కొరత ఏర్పడగా ప్రభుత్వ విధానాలు లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చలేకపో తున్నాయి. లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకుంటే ఉచిత ఇసుకతో పాటు సిమెంటు, ఐరన్, ఇటుకలు, చిప్స్ తదితరాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని అమలు కాని హామీలు ప్రకటించారని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇళ్లు కట్టుకోలేని వారికి ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చినప్పటికీ ఇసుక కొరతతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక సంబంధించిన గ్రామ పంచాయతీల్లో నిల్వ ఉంచి లబ్ధిదారులకు అందిచాల్సి ఉండగా ఇప్పటివరకు ఏ గ్రామ పంచాయతీల్లో అలా చేయలేదు. దీంతో ఇసుక దొరకక లబ్ధిదారులకు గగ్గోలు పెడుతున్నారు.

రాజమహేంద్రవరం నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే ధరాభారం

ఇప్పటివరకూ చేబ్రోలు కేంద్రంగా గోదావరి ఇసుకను అన్ని మండలాలకు సరఫరా చేసేవారు. ఇప్పుడు అక్కడ కూడా గోదావరి ఇసుక నిల్వలు లేకపోవడంతో సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమహేంద్రవరం నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పేరుకే ఉచితం అన్నట్లు ఇసుక సమస్య తయారైంది. రాజమహేంద్రవరం నుంచి 10 టన్నుల ఇసుకను తెచ్చుకోవాలంటే రవాణా ఖర్చులు ఎక్కువగా ఉండటంతో ధరాభారంతో కొంతమంది లబ్ధిదారులు నిర్మాణాలు ఆపివేశారు. ఇటు అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ ఇసుకపై స్పందించకపోవటం, లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించటంలో వారు పూర్తిగా విఫలం చెందారు.

ఇదెక్కడి ట్విస్ట్

ఇదిలా ఉండగా హౌసింగ్, రెవెన్యూ అధికారులు ప్రతి మండలంలో గ్రామ గ్రామానా తిరిగి ఎవరైతే ఇళ్లు నిర్మించుకోలేదో వారికి తాకీదులు ఇస్తున్నారు. వెంటనే లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని అందుకు అవసరమైన మెటీరియల్స్ సహకారం అందిస్తామని తహసీల్దార్లు, హౌసింగ్ ఎఇలు కలిసి లబ్ధిదారులకు ప్రోత్సాహం ఇస్తున్నారు. కానీ ఇసుక లేకుండా నిర్మాణాలు ఏవిధంగా చేపడతారనేది తేలాల్సి ఉంది. మరో ఏడాదికి ఎన్నికలు దగ్గర పడటంతో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు ఏదోలా పూర్తి చేసి లబ్ధిదారుల ఓటు బ్యాంకును పొందాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనిలో భాగంగానే ఎవరైతే ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇళ్లు నిర్మించుకోలేదో వారికి పట్టాలు రద్దు చేస్తామని చేసిన హెచ్చరికలు అధికారులు పెడచెవిన పెట్టి ఇప్పుడు మేము సహకారం అందిస్తాం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

దెందులూరు మండలంలో ఇలా..

దెందులూరు మండలంలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. దీంతో నిర్మాణాలు ఆగిపోవటంతో లబ్ధిదారులు వాపోతున్నారు. అంతేకాకుండా జీవనోపాధి కూడా లేకపోవటంతో తాపీ పనివారు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. దెందులూరు మండలంలో 3523 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో సుమారు వెయ్యి ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టని వారు సుమారు 1100 మంది ఉన్నారు. సుమారు మరో 1400 ఇళ్లు ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. మరికొందరు ఇసుక కొరత వల్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే సాహసం చేయటం లేదు. ఇదే విధంగా జిల్లాలో ఇసుక పరిస్థితి నెలకొని ఉంది.

'దిశ'తో మహిళలకు భద్రత

జిల్లాలో 6 లక్షలకు పైగా దిశా యాప్ డౌన్‌లోడ్
67 వేలకు పైగా ఫోన్‌కాల్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించిన వైనం


దిశా పోలీస్‌స్టేషన్ సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రతి రంగంలోనూ మహిళలు అబలలు కాదు సబలలు అని నిరూపించుకుంటూ వస్తున్నారు. కానీ ఏదో ఒక సమయంలో ఏదో ఒక ప్రాంతంలో ఏదో ఒక పరిస్థితిలో వారు అభద్రతకు గురవుతూనే ఉన్నారు. అంతేకాకుండా వారికి మేమున్నామంటూ నిలబడే ఒక అండ లేకుండా పోయిదనే బాధ కూడా వారిలో ఉండిపోయింది. ఎంతోమంది మహిళలు అఘాయిత్యాల బారిన పడుతూనే ఉన్నారు. ప్రభుత్వం వారికి దిశ చట్టం పేరుతో కొండంత అండనిచ్చింది. దిశ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ సిబ్బంది కూడా దిశా చట్టం ఇచ్చే బలానికి మరింత బలాన్నిస్తూ వారికి మేమున్నామని భరోసా కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఏలూరు జిల్లా వేరైనా తర్వాత కూడా దిశ పోలీసులు మహిళల భద్రత కోసం మెరుగైన సేవలందిస్తూనే ఉన్నారు. జిల్లాలో మహిళల భద్రత కోసం మహిళలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ తీసుకున్న చర్యలు, చేపడుతున్న నూతన మార్గాలు అటు జిల్లా ప్రజల్లోనూ ఇటు మహిళల్లోనూ ప్రశంసలు పొందుతున్నాయి. జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఆదేశాలతో దిశా డిఎస్‌పి కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా దిశా యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతుంది. అంతే కాకుండా జిల్లాలో ఉన్న మహిళా రక్షణ కార్యదర్శుల సహాయ సహకారాలతో దిశ పోలీసులు గ్రామ వార్డు స్థాయి సచివాలయ పరిధిలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టి మహిళల్లో మరింత చైతన్యం తీసుకొస్తున్నారు. ఒంటరిగా మహిళలు వెళ్లాలంటే భయపడే రోజులు పోయి వారి దయనందిన కార్యక్రమాలు వారంతటివారే చేసుకునే స్థాయికి మహిళలకు బలాన్నిచ్చింది దిశ పోలీసులు మాత్రమే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అంతేకాకుండా దిశా చట్టాన్ని అమలు పరచడంలో కూడా దిశా పోలీసులు ఎంతో ముందున్నారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం నిందితులను అరెస్టు చేయడంలో వారికి శిక్షలు పడేలా చేయడంలో వేగవంతంగా దిశ పోలీసులు పని చేస్తున్నారు.

ఆరు లక్షల పైబడి దిశాయాప్‌ల డౌన్‌లోడ్

ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు దిశా యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య 6,02,831గా నమోదైంది. యాప్ ద్వారా 67679 మంది మహిళలు సాయం కోసం దిశా పోలీసులకు ఫోన్ చేశారు వాటిలో చర్యలు తీసుకోదగ్గ ఫోన్ కాళ్లు 2320 నమోదైనవి. ఆపదలో ఉన్న మహిళలు చేసిన ఫోన్ కాల్స్‌లో 257 ఫోన్ కాల్స్‌పై ఎఫ్ఐఆర్లు నమోదు చేశారు. ఇప్పటివరకు మహిళలు ఫోన్ చేసిన కాల్స్ ద్వారా 200313 సమస్యలను పోలీసులు జిల్లా వ్యాప్తంగా పరిష్కరించారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫోన్ కాల్స్‌లో 15 సమస్యలను పక్క జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. వాటిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్న ఫోన్ కాల్స్ ఏడుగా గుర్తించారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు

ఏలూరు జిల్లాలో దిశా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి 26 మంది మహిళలపై అత్యాచార కేసులు, 35 మంది బాలికలపై లైంగిక దాడుల కేసులు, 432 మంది మహిళలపై జరుగు సాధారణ కేసులు, 40 ప్రత్యేక దర్యాప్తు కోసం ఎంపికైన కేసులు నమోదు చేయబడ్డాయి. వీటిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఆరు కేసుల్లో శిక్షలు పడ్డాయి. చాలా కాలంగా పరిష్కారానికి గురికానివి కూడా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు దిశ పోలీసులు చెబుతున్నారు.

మహిళలకు భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యం
జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ



జిల్లాలో శాంతిభద్రతలకు కాపాడడం ఎంత ముఖ్యమో మహిళల భద్రతపై దృష్టి సారించడం కూడా అంతే ముఖ్యం. జిల్లాలో దిశా పోలీసులతో పాటు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చసిన ప్రత్యేక విభాగాల ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నాం. వారి సమస్యలను తీర్చే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. నెలలో రెండుసార్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా రక్షణ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం. వారు మెరుగైన సేవలందించేందుకు పోలీసుల ద్వారా తర్ఫీదు ఇప్పిస్తున్నాం. ఎవరైనా మహిళలు ఆపదలో ఉంటే నేరుగా దిశా పోలీస్‌స్టేషన్ గాని పోలీస్ స్టేషన్‌లో ఉన్న దిశ విభాగానికి గాని హెల్ప్ డెస్క్ నెంబర్ గాని సంప్రదించిన వెంటనే క్షణాల్లో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని ఆపదలో ఉన్న మహిళలకు రక్షణ కల్పిస్తారు.

మహిళల భద్రత ముఖ్యం
దిశా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి సత్యనారాయణ



మహిళల భద్రత కోసం ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వాడల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో, పురపాలక సంఘ కేంద్రాల్లో కూడా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించేలా భద్రత చర్యలు చేపడుతున్నాం.

ఇళ్ల స్థలాలు మేరక చేయాలి

వైఎస్ఆర్ ఫొటోలు ప్రదర్శిస్తూ లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - మండవల్లి

పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ లబ్ధిదారులు లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇళ్ల స్థలాల వద్ద కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జగన్మోహన్ రెడ్డి ఫొటోలను ప్రదర్శిస్తూ వారిపై ఉన్న అభిమానాన్ని చాటుతూ వినూత్నంగా ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి స్థలం కొనుగోలు చేసి కేటాయించి నేటికి 16 సంవత్సరాలని చెప్పారు. ఆ ప్రాంతం లోతట్టుగా ఉండడంతో అప్పటి నుంచి నేటి వరకు ఆ స్థలాలు మేరకు నోచుకోకపోవడంతో నేటి వరకు ఆ ప్రాంతాల్లో నివాసం ఏర్పాటు చేసుకోలేక నానా అవస్థలు పడుతున్నామని బాధితులు వివరించారు. గత ప్రభుత్వ హయాం నుంచి నేటి వరకు ఎంతోమంది ప్రజాప్రతినిధులను, నాయకులను, అధికారులను కలిసి గోడును వెల్లగించుకోవడంతోపాటు అనేక గ్రామసభల్లో కూడా పలుమార్లు అర్జీలను సమర్పించినప్పటికీ ఇళ్ల స్థలాల మేరక విషయం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని స్పష్టం చేశారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు కుటుంబాన్ని పోషించుకోలేక అద్దె ఇళ్లకు అద్దెలు కట్టలేక నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సుధీర్ఘ పాదయాత్రలో మండవల్లి వచ్చినప్పుడు లబ్ధిదారులంతా ముక్తకంఠంతో ఇళ్ల స్థలాల మెరకపై ఆయన దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం రాగానే మేరక చేయించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ కూడా ఇచ్చారని వారు తెలిపారు. ఇప్పటికైనా తమపై దయ చూపించి నివాసం ఏర్పాటు చేసుకునేలా సహకరించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న స్పందనలో సోమవారం అర్జీ ఇస్తున్నామని తెలిపారు. ఆయనను కలవడం అంటూ జరిగితే పదహారేళ్ల నుంచి పడుతున్న సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందని పేదవాడి సొంత ఇంటి కల నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు టెంటు అప్పారావును కూడా మంచి జరగాలని కోరుతూ లబ్ధిదారులకు సంఘీభావం పలికారు.



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ఆదర్శవంతంగా వైసిపి సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నికలు దగ్గరపడుతున్న క్రమంలో రాష్ట్రంలో దొంగల దండు బయలుదేరిందని, వీరి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరులో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆదివాంం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిడిపి హయాంలో వెలగపూడిలో అడుగు రు.12 వేలు వెచ్చించి నిర్మించారని, అయితే వర్షం వస్తే అంత లీకేజీ అని అన్నారు. వైసిపి ప్రభుత్వం అడుగు రూ.1500 చొప్పున ఎన్నో హంగులతో, సుందరంగా నిర్మించామని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉండగా దాచుకో దోచుకో అన్నట్టు అవినీతి చేశారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఒక్కటి కూడా సరైన పథకాన్ని ప్రవేశ పెట్టారా అని ప్రశ్నించారు. దొంగల ముఠాగా మారి రాష్ట్రాన్ని చంద్రబాబు అండ్ బ్యాచ్ దోచేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయాలతో సంబంధం లేకుండా వినూత్న పథకాలు వాలంటీర్, సచివాలయ వ్యవస్థలతో మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు వైసిపి ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలోని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లోని అభివృద్ధి కార్యక్రమాలు వైపు చూస్తున్నాయన్నారు. జగన్ ప్రవేశపెట్టిన ఆర్‌బికె వ్యవస్థను దేశమంతటా ప్రవేశపెట్టాల్సి ఉందని సూచించారు. రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల బృందాలను పరిశీలించి వెళ్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ రాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), సర్పంచులు ఇంజేటి మరియమ్మ, లక్ష్మీపతి, ఎంపిటిసిలు నాగలక్ష్మి, స్వాతి, నాయకులు చేకూరి రాజా నరేంద్ర వర్మ, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు, భూపతి రాజు వంశీకృష్ణంరాజు, కాశీ విశ్వనాథరాజు, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

నేరాలు-ఘోరాలు



18 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా నిల్వ ఉంచిన 18 టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్, విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ముసునూరు మండలంలోని వేల్పుచర్ల శివారు అన్నపనేనివారిగూడెం గ్రామంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్, విజిలెన్స్ అధికారులు, సూపర్ వైజర్ గడ్డం కోటేశ్వరరావు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో అన్నపనేనివారిగూడెంలో ఉన్న శ్రీమారుతి ఆగ్రోస్ ఫౌల్ట్రీ కంపెనీ వారు నిల్వ ఉంచిన సుమారు 18 టన్నులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ బియ్యం విలువ రూ.3.20 లక్షలు ఉంటుందని చెప్పారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని రామచంద్రపురంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రామచంద్రపురం పరిమి గంగరాజు పొలంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పరిమి గంగరాజుతో పాటు మరో ఏడుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.14350 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు, 104 పేకాట కార్డులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

చింతలపూడి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమ్ముగూడెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారను. వారి వద్ద నుంచి రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.